కథ

# పందెం

సిహెచ్. మల్లేశ్వరరావు




''రైట్ - రైట్'' చింతలపూడి నుండి ఏలూరు వెళ్ళే ఆర్.టి.సి. బస్సు రామచంద్రాపురం అడ్డరోడ్డు దగ్గర ఆగి కోటయ్యను ఎక్కించుకొని బయలుదేరింది. బస్సు ఎక్కేటప్పుడు మెట్లకు 'దణ్ణం' పెట్టుకుని ఎక్కుతున్న కోటయ్యను వింతగా చూసాడు కండక్టరు. టిక్కెట్టు తీసుకుని చేతిసంచితో లోనికి నడిచాడు. లోపల అయిదారుగురు కంటే ఎక్కువలేరు ప్రయాణికులు. ఖాళీగా వున్న సీటు చూసుకుని కిటికీ ప్రక్కగా సంచి వళ్ళో పెట్టుకుని కూర్చున్నాడు.

చాలా కాలంగా కలగానే వుండిపోయిన కోరిక నెరవేర్చుకోవటానికి ఇప్పుడు ఇలా బయలుదేరాడు. బస్సు ఏలూరు చేరింది. బస్సు దిగి రైల్వే స్టేషనుకు నడక సాగించాడు.

కోటయ్యకు కోడిపందాలంటే మహాసరదా. చుట్టుప్రక్కల ఏ వూళ్ళో పందాలు జరగుతున్నా చూడటానికి అక్కడికి వెళ్ళిపోతూ వుంటాడు. తనూ ఒక పుంజును పెంచి పందెం వేద్దామని ఎన్నాళ్ళు గానో అనుకుంటూ వున్నాడు. మనసుకు నచ్చిన పుంజు దొరకలేదు.

గన్‌బజారు రైల్వే గేటు దాటిన తరువాత ఆంజనేయస్వామి గుడి కనిపించింది. బ్రేకు వేసిన వెహికల్‌లా ఆగిపోయాడు. జేబులోనుండి అర్ధ రూపాయి బిళ్ళతీసి, హుండీలో వేసి, స్వామికి మొక్కు కున్నాడు. ''స్వామీ! నాకు తెలిసిన దేవుళ్ళందరిలో నువ్వే కండలు తిరిగిన వస్తాదులా బలంగా వుంటావు. నేను కోడిగుడ్డు కోసం బొబ్బిలి వెళుతు న్నాను. నీలాగ బలంగావుండే గుడ్డు దొరికేలా ఆశీర్వదించు. అదే జరిగితే తిరిగి ఇంటికి వెళ్ళేట ప్పుడు నీకు కొబ్బరికాయ కొడతాను. దయచూడు స్వామీ!'' అని రెండు చేతులూ జోడించి దణ్ణం పెట్టుకుని బయలుదేరాడు. బుకింగ్ కౌంటర్ దగ్గరకు వెళ్ళి బొబ్బిలి వెళ్లే బండి ఎన్నిగంటలకు వస్తుంది అని అడిగాడు.

''రాత్రి పదిన్నరకు రాయగడ్ వెళ్ళే ప్యాసింజరు వుంది'' అన్నాడు బుకింగ్ క్లర్క్. బొబ్బిలి టిక్కెట్టు తీసుకుని వంతెన మీదుగా రెండవ నెంబరు ప్లాట్ ఫారం మీదకు వెళ్ళి బెంచిమీద కూర్చున్నాడు. కాలం కదలకుండా వుండి పోయినట్లు అనిపిస్తూ వుంది కోటయ్యకు. బండి త్వరగా వచ్చేస్తే బావుణ్ణు అని విసుక్కుంటూ ఆలోచనల్లోకి జారిపోయాడు.

పందెం పుంజు కోసం కోటయ్య ఆరాటం చూస్తున్న పక్కింటి వెంకయ్య అన్నాడు. ''నీకు పుంజును పెంచి పందెం వేయాలని మహా ఇదిగా ఉంది. కొనదలుచుకున్నప్పుడు అలాంటిది కాకుండా బొబ్బిలి పుంజును కొను. దేశం మొత్తమ్మీద పౌరు షానికి పేరు బొబ్బిలి పుంజు. అయితే ఇక్కడ ఒక చిక్కువున్నాది. బొబ్బిలి నుండి పుంజును బయటకు తీసుకు రానివ్వరు. ఒకవేళ ఎలాగో ఒకలా నువ్వు తీసుకు వద్దామనుకున్నా. పదివేలో, పదిహేను వేలో పెట్టి నువ్వు కొనలేవు. అందుకని నువ్వు బొబ్బిలి వెళ్ళి మాంచి పుంజు తయారయ్యే గుడ్డు నొకదాన్ని కొని తెచ్చేయి. ఇక్కడ పొదిగించి పిల్ల చేయించుకుని పెంచుకుంటే బ్రహ్మాండంగా తయారువుద్ది. నీ కోరిక తీరిపోద్ది. కాకపోతే కొంచెం ఆలస్యం'' అంతే. ఈ ఆలోచన బావున్నట్టు అనిపిం చింది కోటయ్యకు. అందుకనే తెలియని వూరైనా తెగించి ఇలా బయలు దేరాడు.



పదకొండు గంటలకు మెల్లగా వచ్చింది రాయగడ వెళ్ళే ప్యాసింజరు. ఏ కంపార్టుమెంటులో ఎక్కుదామన్నా కిటకిటలాడుతూనే వుంది. రద్దీ మూలంగా ఫుట్‌బోర్డుకు ''దణ్ణం'' పెట్టి ఎక్కటం కుదరలేదు. ఎలాగోలా ఎక్కి గుమ్మం దగ్గరే నిలబడి, బండి బయలుదేరిన తరువాత అలా గుమ్మాం దగ్గరే చితికిల బడ్డాడు. పల్లెటూరు కావటం మూలాన రాత్రి ఎనిమిది గంటలకే నిద్రపోయే అలవాటు వున్న కోటయ్య బండి పరిగెడుతున్నప్పుడు వచ్చే చల్లగాలికి నిద్రలో జోగుతున్నాడు. రైలు తాడేపల్లగూడెం ఔటర్‌లో వుండగా ప్రక్కన కూర్చున్న అతను కోటయ్యను నిద్రలేపి అన్నాడు. ''గుమ్మం దగ్గరే కూర్చొని నిద్రపోతున్నావు. తూలావంటే క్రింద పడిపోగలవు జాగ్రత్త''. కోటయ్య లేచి కళ్ళునులుముకుని చూసేటప్పటికి రైలు స్టేషనులో ఆగింది. చుట్టకాలిస్తే నిద్ర వదలి పోతుందనుకున్న కోటయ్య జేబులో నుండి చుట్ట తీసి వెలిగించాడు. వెంటనే దేముడిలా ప్రత్యక్షమై పోయాడు రైల్వే కానిస్టేబుల్.

''ఏంటీ! దర్జాగా చుట్ట వెలిగించావు'' అన్నాడు.

''నిద్రొస్తుంది. గుమ్మం దగ్గర కూర్చున్నాను కదా, నిద్రరాకుండా చుట్ట వెలిగించాను. ఏం తమరికి ఒకటి ఇవ్వమంటారేమిటి లంకపొగాకుది చాలా బావుంటాది'' అన్నాడు కోటయ్య.

కానిస్టేబులుకు కపాలం పగిలినట్లయింది. ''ఏం తమాషాగా వుందా?'' హూంకరించాడు. ఈ లోగా రైలు కదిలింది. కానిస్టేబులు కూడా లోపలకు ఎక్కేసాడు. చాలా సంవత్సరాలుగా రైలెక్కని కోటయ్యకు తెలియదు పాపం. రైల్లో, రైల్వేస్టేషన్లో పొగత్రాగకూడదు అని. ప్రక్కన వున్న వాళ్ళు చెబితే ఇప్పుడే తెల్సింది. కానిస్టేబులు ''రెండు వందల యాభై రూపాయలు'' ఫైన్ కట్టమన్నాడు. కోటయ్య బ్రతిమిలాడటం మొదలుపెట్టాడు. ప్రక్కన వున్న వాళ్ళు కూడా నచ్చచెప్పిన మీదట నూట యాభై రూపాయలు జేబులో పెట్టుకుని నిడదవోలులో దిగిపోయాడు కానిస్టేబులు. తర్వాత పిలిచినా నిద్ర దగ్గరకు రాలేదు కోటయ్యకు. కాని స్టేబుల్ని తిట్టుకుంటూనే ఇకముందు ఏ నష్టం జరుగకుండా లాభంగా ఇంటికి చేరేలా చూడమని దేవుళ్ళందరికీ దణ్ణాలు పెట్టుకున్నాడు. రాజమండ్రి చేరిన తరువాత కొంతమంది దిగితే లోపలకు సర్దుకున్నాడు.

ప్రొద్దున్న ఎనిమిదిన్నరకు రైలు విశాఖపట్టణం చేరింది. ముఖం కడుక్కుని టిఫిన్ చేద్దామని చేతిలో వున్న సంచిని మళ్ళీ ఎవరూ కూర్చోకుండా సీటు మీద వుంచి క్రిందకు దిగాడు. పంపు దగ్గర నీళ్ళు పుక్కిలించి, ముఖం కడుక్కుని, ఇడ్లీ కొనుక్కొని కంపార్టుమెంటు దగ్గరకు వచ్చాడు. లోపలకు చూస్తే ఖాళీసీటు వెక్కిరించింది. సంచిలేదు. గబగబా లోపలికి వెళ్ళి అక్కడవున్న వాళ్ళందరినీ అడిగాడు. ఎవరూ చూడలేదని అన్నారు.

ప్రయాణంలో బట్టలు మాసిపోతే బండిదిగిన తర్వాత వేసుకుందామని చొక్కా, పంచె, కండువా

సంచిలోపెట్టి తెచ్చుకున్నాడు. ఎవడో దరిద్రుడు వాటిని పట్టుకుపోయాడు. కాసేపు తిట్టుకుని పోతేపోయిందిలే అనుకున్నాడు.

పన్నెండు గంటలవుతూ వుండగా బొబ్బిలిలో అడుగు పెట్టాడు.

''గుడ్డు'' మీద వున్న కోరికతో ఇంతదూరం రావటమైతే వచ్చాడుగాని, దాన్ని ఎలా కొనాలో, ఎవర్ని అడగాలో తెలియటంలేదు. ఆకలి దంచేస్తోంది. సంచిపోవటంతో ప్రొద్దున్న కొనుక్కున్న ఇడ్లీ కూడా తినలేదు. తినబుద్దికాక పారేసాడు. టిఫిన్ చేద్దామని బస్టాండు దగ్గరవున్న చిన్న టీ స్టాల్‌లో జొరబడ్డాడు. ఏదో కొంత తిని, టీ త్రాగి, వెసులుబాటుగా కూర్చొని వున్న టీ స్టాల్ యజమానిని కదిలించాడు. తన కథ మొత్తం చెప్పి ఎలాగైనా సాయం చేయమని బ్రతిమిలాడాడు. అంతా విన్న తర్వాత వీడెవడో వెర్రిబాగులవాడు అని అర్థమైపోయింది టీ స్టాల్ యజమానికి ''అయితే నీకు మాంచి పుంజు తయారయ్యే గుడ్డు కావాలంటావు అంతేనా?'' అడిగాడు. ''ఏ గుడ్డు పుంజు అవుద్దో, ఏ గుడ్డు పెట్ట అవుద్దో ఎవడికన్నా తెలుస్తుందా'' మనసులో అనుకున్నాడు టీ స్టాల్ యజమాని.

''అంతే- అంతే మంచి గుడ్డొకటి కొనిపెట్టావంటే నీ రుణం వుంచుకోను'' అన్నాడు.

''గుడ్డు దొరకడం అంటే మాటలు కాదు. అదీకాక నీకు పుంజు అయ్యేగుడ్డు కావాలి. అది దొరకడం మరీ కష్టం. పుంజునేకాదు గుడ్డును కూడా ఈ వూరి నుండి బయటకు తీసుకువెళ్ల నివ్వరు'' అన్నాడు టీ షాపు యజమాని.

''బాబ్బాబు. దానికోసం చాలా దూరం నుండి వచ్చాను. ఇక్కడ నువ్వుతప్ప నాకెవరూ తెలవరు. నువ్వే ఒకదారి చూపించి పుణ్యం కట్టుకోవాలి'' అన్నాడు.

''చాలా దూరం నుండి వచ్చావని జాలేస్తోంది. నేనేకొని నీకు ఇచ్చానని తెలిస్తే నా తాట తీసేస్తారు. నిన్ను చూస్తే కాదనబుద్ధి అవటంలేదు. సరే! ఏదైతే అదయ్యింది. డబ్బులివ్వు గుడ్డు తెచ్చిపెడ్తాను'' అన్నాడు. చెయ్యకూడని పనేదో చేసిపెడున్నట్టు ఫోజు పెట్టాడు.

''ఎంత ఇవ్వమంటావు?'' అడిగాడు కోటయ్య.

''రెండువందల యాభై రూపాయలివ్వు''

''గుడ్డు రెండువందలయాభై రూపాయలా?'' గుడ్లు తేలేసాడు కోటయ్య.

''కష్టపడి తెచ్చినందుకు నాకు ఒక యాభై రూపాయలు ఇవ్వాలి. అలా అయితేనే తెచ్చి పెడతాను. కొట్టు వదిలి వెళ్లినందుకు నాకూ కొంత లాభం వుండాలిగా లేదంటే నువ్వే వెళ్ళి వెదుక్కో. పొరుగూరు పట్టుకు పోతావని తెలిస్తే వళ్ళు కుళ్ళ బొడిచేస్తారు'' నేను తప్ప నీకు మరొక దారిలేదు అని భయపెట్టాడు.

ఎందుకైనా మంచిదని డబ్బులు ఎక్కువ తీసుకు రాబట్టి సరిపోయింది లేకపోతే.... ఏం చేస్తాం. తప్పదు అనుకుంటూ లోపల జేబులో నుండి మూడు వందలూ తీసి టీ స్టాల్ యజమానికి ఇచ్చాడు. ''వూరంతా నీ పేరు చెప్పుకునే లాగ మంచి బలమైన పుంజు అయ్యే గుడ్డు తెచ్చిపెట్టు''

''అందంతా ఇక నా కొదిలెయ్. నువ్వు తిరగలేవు గాని ఇక్కడే కూర్చో'' కుర్రవాడికి కొట్టు అప్పగించి వెళ్ళిపోయాడు యజమాని

బలమైన గుడ్డు కోసం బలమైన దేవుడితోపాటు మిగిలిన దేవుళ్ళకు కూడా దణ్ణాలు పెట్టుకుంటూ కూర్చున్నాడు కోటయ్య.

పావుగంట - అరగంట - ముప్పావుగంట అయిపోయింది. గుడ్డు కోసం వెళ్ళినవాడు రాలేదు. వీడుగాని డబ్బులు పట్టుకుని పోలేదు కదా! అనుకుంటూ వుండగానే వచ్చాడు. బయటకు కనబడకుండా కాగితంలో చుట్టి తెచ్చిన గుడ్డును బొడ్లోనుంచి తీసిచ్చాడు. కళ్ళకు అద్దుకుని బలమైన దేముడ్ని తలుచుకుని కాగితం విప్పాడు కోటయ్య. పెద్దగా వుంటుందని ఊహించుకున్న గుడ్డు (రెండు వందల యాభై రూపాయలు మరి) సాధారణమైన సైజులో కనిపించేసరికి ఆశ్చర్య పోతూ అడిగాడు. ''మామూలు కోడిగుడ్డు అంతే వుందే'' అని

''కోడిగుడ్డు కోడిగుడ్డంత వుండకపోతే తాటిపండు అంత వుంటాదేటి''

''మరి ఇది పుంజుఅయ్యే గుడ్డేనా?'' మళ్లీ అనుమానం.

''బొబ్బిలి సంగతి నీకు తెలియదనుకుంటా. ఇక్కడ పుంజుపెట్టిన గుడ్డు పుంజే అవుద్ది''

''పుంజు గుడ్డు పెట్టడం ఏంటి''

''మరదే బొబ్బిలి స్పెషల్. ఇక్కడ పెట్టతో పనిలేకుండా పుంజు గుడ్డుపెడుతుంది. పుంజులో కలిసి పరుగెత్తకుండానే పెట్టగుడ్డు పెడుతుంది. ఇది 'బొబ్బిలి డేగ' గుడ్డు. మా గొప్ప పవర్‌ఫుల్. ఎవరూ చూడకుండా జాగ్రత్తగా పట్టుకెళ్లు. లేకపోతే నా పీకకు చుట్టుకుంటుంది''

ఇంకేమీ మాట్లాడ లేకపోయాడు కోటయ్య.

సంచి కూడా లేదు. ఎలా పట్టుకు వెళ్ళాలో తెలియక టీ స్టాల్‌వాడ్నే అడిగాడు. వాడు మరొక పదిరూపాయలు అడిగి తీసుకుని ప్రక్కన వున్న కిళ్ళీబడ్డీ దగ్గర ఖాళీ జర్దాడబ్బా అడిగి తెచ్చాడు. దాన్లో ఊకపోసి, మధ్యలో గ్రుడ్డుపెట్టి కదలకుండా చుట్టూ ఊకకూరి, గుడ్డుకు ఏ మాత్రం అపాయం లేకుండా చేసి, మూతపెట్టి ఆ డబ్బాను ఒక ప్లాస్టిక్ కవర్లో పెట్టి కోటయ్యకు ఇచ్చాడు. ఎవరికీ తెలియనివ్వద్దని హెచ్చరిక కూడా చేసాడు. సంతోషపడిపోయిన కోటయ్య టీ స్టాల్ అతనికి కృతజ్ఞతలు చెప్పి బయలుదేరాడు.

ఏలూరులో రైలు దిగిన తరువాత గన్‌బజారులోని ఆంజనేయస్వామిని పలుకరించి, కొబ్బరికాయ కొట్టి, బస్సెక్కి ఇంటికి చేరాడు.

ఇక గుడ్డు పొదిగించే కార్యక్రమంలో పడ్డాడు. ఎవరి ఇంట్లో పెట్ట పొదుగుకు వుందో వూరంతా గాలించి పట్టుకున్నాడు. వాళ్ళతో మాట్లాడి తన



గుడ్డుకూడా వాళ్ళ గుడ్లతోపాటు పొదిగించడానికి పాతిక రూపాయలిచ్చి వప్పించాడు. ఇప్పుడు ఇంకొక ప్రశ్న ముందుకొచ్చింది.

''అన్నిగుడ్లూ ఒకలా వున్నాయి. వాటిలో కలిసిపోతే తన గుడ్డు ఏదో, అందులోంచి వచ్చిన పిల్లేదో, ఎలా తెలుసుకోవటం''

ఆలోచించగా బ్రహ్మాండమైన ఆలోచన వచ్చింది.

వూళ్ళో శారీపెయింటింగు నేర్చుకున్న అమ్మాయి దగ్గరకు వెళ్ళి గుడ్డుకు ఎర్రరంగు వేసిపెట్టమని బ్రతిమిలాడాడు. ''ఎందుకు'' అని ఆ అమ్మాయి విషయం తెలుసుకుని ''అన్ని గుడ్లూ తెల్లగా వుండి ఇదొక్కటే ఎర్రగా వుంటే ఇది నా గుడ్డుకాదని కోడి పెట్ట ముక్కుతో పొడచి పగులగొట్టేయదా?'' అని అడిగింది. మళ్ళీ ఆలోచనలో పడిపోయాడు కోటయ్య.

ఆ అమ్మాయే సొల్యూషను కూడా చెప్పింది.

''గుడ్డుమీద చిన్న అక్షరాలతో నీ పేరు వ్రాస్తా. నువ్వు తేలికగా గుర్తు పట్టొచ్చు'' అని.

బావుంది అనుకుని గుడ్డుమీద పేరు రాయిం చుకుని ఆ అమ్మాయి వద్దన్నా వినకుండా పది రూపాయలు ఆ అమ్మాయి చేతిలో పెట్టి గుడ్డు తీసుకువెళ్ళి పొదుగుకు పెట్టించాడు. ఆ ఇంటివాళ్ళ అబ్బాయికి అయిదు రూపాయలు ఇచ్చి గుడ్డు పగులురాగానే వచ్చి తనకు చెప్పమన్నాడు.

కోడి పొదిగి పిల్ల బయటకు రావటానికి మూడు వారాలు పడుతుంది. ఆ విషయం తెల్సినా, రోజూ గంటకు ఒకసారి వెళ్ళి చూస్తున్నాడు కోటయ్య. ఈ బాధ భరించలేక గుడ్డును తీసుకుపొమ్మన్నారు వాళ్ళు. వాళ్ళను బ్రతిమిలాడి, కబురొచ్చేవరకూ రానని చెప్పి వప్పించి ఇంటికి వచ్చాడు.

మెల్లగా రోజులు గడుస్తున్నాయి. కోటయ్యకు ఆత్రుత ఎక్కువ అయిపోతోంది. ఆ రోజు రానే వచ్చింది. కోటయ్యకు కబురొచ్చింది. ఉరుకులు- పరుగుల మీద వెళ్ళి వాలిపోయాడు. కోడి మేతకు వెళ్ళింది. కొన్ని గుడ్లలోనుండి పిల్లలు బయటకు వచ్చాయి. కోటయ్య గుడ్డు చిన్న పగుల్తో రడీగా వుంది.

★★★

కళ్ళార్పకుండా అలాగే చూస్తూ వున్నాడు కోటయ్య. ముక్కులో పెంకుని పగులగొట్టుకుని పిల్ల నాజూకుగా తల బయటపెట్టింది. కోటయ్య ఆనందంతో మైమరచిపోయి చిన్న కేకపెట్టాడు. మెల్లగా పెంకును ఛేదించుకుని మూడంగుళాల గుడ్డులో నుండి ఆరంగుళాల పిల్ల బయటకు వచ్చింది. అంతపెద్ద కోడిపిల్లను కోటయ్యే కాదు, ఎవరూ ఎప్పుడూ చూసివుండరు. ఆనంద తరంగంలా పిల్లను చేతిలోకి తీసుకుని, చెలియలి కట్టను చేరుకునే కెరటంలా ఇంటికి పరుగు తీసాడు. వీధిలోనుండే భార్యను కేకవేసాడు. బయటకు వచ్చిన కోటయ్య భార్య కోటయ్య చేతిలో వున్న కోడిపిల్లను చూసి ఆశ్చర్యపోయింది. సాధారణంగా ఆరువారాలు తరువాత, పుంజో, పెట్టో నిర్ధారించే 'జుత్తు' కోడి పిల్ల తలమీద మొలుస్తుంది. అలాంటిది జుత్తుతోనే పుట్టి, బ్రౌన్ కలర్‌లో మిలమిల మెరిసిపోతున్న 'బొబ్బిలి డేగ'ను జీవితంలో మొదటిసారి చూసింది. భార్య చెప్పగా కోటయ్య కూడా అప్పుడే పరిశీలనగా చూసాడు. పెద్దగా నవ్వి 'బొబ్బిలిడేగా మజాకా' అన్నాడు. వూరి వాళ్ళంతా వచ్చి వింతను చూసినట్టు బొబ్బిలి డేగను చూసి వెళుతున్నారు. పనులన్నీ మరచిపోయి బొబ్బిలిడేగ సంరక్షణే పనిగా పెట్టుకున్నాడు. తవుడు, రకరకాల గింజధాన్యాలు వేస్తున్నాడు. మాంసాహారం బలమని కనిపించిన చోటల్లా తవ్వేసి వానపాములు, చుట్టు ప్రక్కల ఇళ్ళలో దూరి బల్లులు పట్టుకొచ్చి దానికి వేస్తున్నాడు. ఇంతింతై వటుడింతై అన్నట్టుగా రోజుకు రెండంగుళాలు చొప్పున 'మూడు అడుగులు' పెరిగింది బొబ్బిలిడేగ. కోటయ్యకు పట్టపగ్గాలు లేవు. ఆ నోట ఆ నోట బొబ్బిలిడేగ సంగతి రాష్ట్రమంతా తెల్సిపోయింది. ఒక టి.వి. ఛానెల్ వాళ్ళు వచ్చి కోటయ్యను ఇంటర్వ్యూ చేసి ప్రసారం చేసారు. దాంతో దేశమంతా బొబ్బిలి డేగ సంగతి తెల్సిపోయింది. ఇంతటి సంతోషంలోనూ ఒక చింత కోటయ్యను వెంటాడుతుంది. బొబ్బిలి డేగ చూసిన పందెగాళ్ళంతా దాంతో పందెం వేయటానికి జమౌతున్నారు. కోటయ్య కోరిన కోరికగానే వుండిపోయింది.

ఒక రోజు ఉదయం తెల్లటి టాటాసుమో వచ్చి కోటయ్య ఇంటి ముందు ఆగింది. 'పల్నాటి నెమలి' మాచర్ల నుండి వచ్చిన పందెగాడు క్రిందకు దిగాడు. ఎప్పుడూ లేనిది వూర్లోకి కారురావటం చూసి జనం పోగయ్యారు. బొబ్బిలి డేగ అంత కాకున్నా దానికి ధీటుగానే వుంది పల్నాటి నెమలి. లక్ష రూపాయలు పందెం అంటూ రెచ్చగొడుతున్నాడు పల్నాటి పందెగాడు. కోటయ్య దగ్గర అంత డబ్బులేదు రాకరాక వచ్చిన పందెం చేజారిపోతుం దని డీలాపడిపోయాడు. గమనించిన జనం '''నీ బోడి పుంజుతో మా డేగను గెలుద్దామనే ఇంత దూరం వచ్చావా? చాల్లే వెళ్ళు-వెళ్ళు'' అంటూ వేళాకోళం చేసారు. తన పుంజును బోడిపుంజు అన్నందుకు పల్నాటి పందెగాడు రెచ్చిపోయాడు. కోపంతో వూగిపోయాడు. ''నా నెమలి గెలిస్తే మీరు డబ్బు ఇవ్వనవసరంలేదు. పుంజును ఇస్తే చాలు. మీ డేగ గెలిస్తే నేను నా నెమలి, లక్ష రూపాయలు ఇస్తాను. దమ్ముంటే పందెం వెయ్యండి'' అంటూ సవాలు విసిరాడు. వాడి ప్రక్కన వున్నవాళ్ళు వద్దని చిప్పినా వినలేదు. పందెం కుదిరిపోయింది. కోటయ్య ఒక షరతు పెట్టాడు. ''పుంజులకు గాయాలు కాకుండా 'డింకీ పందెం' (కాళ్లకు కత్తులు కట్టకుండా) వేద్దామ న్నాడు''. ఓ.కే. అయింది. నాలుగు రోజుల తర్వాత ముహూర్తం. నాలుగు రోజులు మాచర్లనుండి వచ్చిన వాళ్ళంతా ఇక్కడే వుండిపోయారు.

పందెం జరిగే రోజు వచ్చింది. చుట్టు ప్రక్కల గ్రామాల నుండే కాకుండా రాష్ట్రం నలుమూలల నుండి కోడిపందెం అభిమానులు విపరీతంగా వచ్చారు. గ్రామమంతా జనసంద్రంలా వుంది. ఎలా తెల్సిందో ఏమో ఒక టి.వి ఛానెల్ వాళ్ళు వచ్చి 'లైవ్ టెలికాస్ట్' ఇచ్చారు. పై పందాలుగా లక్షల రూపాయలు చేతులు మారుతున్నాయి.

పుంజులు బరిలో దిగాయి. జనాన్ని చూసి 'బొబ్బిలిడేగ' తల పైకెత్తి కెక్కిరించింది. డి.టి.యస్. సౌండ్ సిస్టమ్‌లా వున్న దాని కేకకు జనం అదిరి పోయారు పుంజులు తలపడ్డాయి. వాటి రెక్కల విసురుకు ధూళి పొగలా కమ్మేస్తోంది. బొబ్బిలిడేగ పల్నాటి నెమలికి అవకాశం ఇవ్వటం లేదు. పోరు కొనసాగుతూ ఉంది. మధ్య- మధ్యలో ఆపి పుంజులకు నీరు త్రాగించి మళ్లీ వదులుతున్నారు. గంటన్నర తర్వాత నెమలి, డేగ ధాటికి ఆగలేక బరిదాటేసింది. బొబ్బిలి డేగ దాన్ని తరిమి తరిమి కొట్టింది. జనం కోటయ్యను భుజాలకెత్తుకుని డేగతో సహా ఊరేగించారు. మారుమూల వున్న ఊరికి రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన కోటయ్యను ఊరిజనం అంతా కల్సి సత్కరించారు.

★★★

చూస్తూ వుండగానే కలకరిగిపోయి, కోటయ్య కళ్ళముందు 'అంగుళం ఎత్తు రెండంగుళాల పొడవు' వున్న నల్లటి చిన్న కోడిపిల్ల దర్శనమిచ్చింది. ఆరు కాదు అరవై వారాలైన దాని నెత్తిమీద జుత్తు మొలవ లేదు. అది పెట్టకాబట్టి.

★

